

రేపటితో ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు ఆఖరు

వికారాబాద్, మే 2: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 4వరకు గడువుందని వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల నుంచి ఆన్‌లైన్ ద్వారా కూడా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే ఫీజును కాలేజీల్లో చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ సూచించారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన నార్సింగ్ నుంచి అప్పా జంక్షన్‌కు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డు

నిప్పుల కొలిమి..!


- భానుడి ఉగ్రరూపంతో ఉక్కిరి బిక్కిరి
- ఉక్కపోత, వడగాడ్పులతో విలవిల
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- కీసర, పుట్టపహాడ్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఉమ్మడి జిల్లాలో ఆరు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

తేది	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
02మే	44.0	44.3	44.3
01మే	43.9	44.1	44.9
30 ఏప్రిల్	44.0	44.8	44.8
29 ఏప్రిల్	43.6	43.2	43.8
28 ఏప్రిల్	42.9	42.8	43.5
27 ఏప్రిల్	43.5	43.1	43.4

రంగారెడ్డి అర్బన్, మే 2 : భానుడి ఉగ్రరూపంలో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఓ వైపు ఎండవేడి, మరో వైపు ఉక్కపోత, ఇంకోవైపు వడ గాల్పులు.. జనాలు విలవిల్లాడిపోతున్నారు. మాడు పగిలే ఎండలతో బెంబేలెత్తిపోతున్నారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పగటి ఉష్ణోగ్రలు భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటాయి. బయటకు రావడానికే జనం జంకుతున్నారు. నాలుగు రోజులుగా వడగాడ్పులకు నియోజకవర్గ, మండల కేంద్రాలు నిర్మానుష్యంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉదయం 9 గంటల తర్వాత బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. అత్యవసర పనులున్న వారు మినహా మిగతా ఎవరూ బయటకు రావడం లేదు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని. రానున్న రెండు రోజుల పాటు ఎండలు గరిష్ఠంగా ఉండవచ్చని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడ గాల్పులతో నీరసం, అలసట, తీవ్రమైన దాహం, వడదెబ్బ వంటి వాటికి గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటి బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజిరి మండలం కీసరలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 44.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.





చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాలను నిర్ణయించే స్థాయిలో యువ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓట్లలో సగానికి పైగా వీరే ఓటుహక్కు కలిగి ఉన్నారు. దీంతో వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ముమ్మర యత్నాలు చేస్తున్నాయి. వారి డిమాండ్లను నెరవేరుస్తామని అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు హామీలు ఇస్తున్నారు. యువతపై ప్రధాన దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో యువత ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతుందో చూడాలి.

ప్రధాన పార్టీల దృష్టి వీరిపైనే

ప్రధానంగా యువత ఓట్లు ఎక్కువగా ఉండడంతో వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు వివిధ పార్టీలు, అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ముగియగానే మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తోంది. ఇప్పటికే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సుమారు 30వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, ఇంకా వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేస్తామని యువతకు హామీ ఇస్తోంది. దీంతో పాటు గత ప్రభుత్వం వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని నింపలేదన్న విమర్శలు కూడా చేస్తోంది. దీంతో పాటు తమ ప్రభుత్వం రెగ్యులర్‌గా జాబ్ క్యాలెండర్ రూపొందించి ప్రతీ ఏడాది ఖాళీలను భర్తీ చేస్తామని, యువతకు ఉద్యోగాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని చెబుతోంది. ఇక, బీజేపీ కూడా కేంద్రంలోని తమ ప్రభుత్వం యువత కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టింది అమలు చేస్తోందని, మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి యువతకు అన్ని రకాలుగా అండగా ఉంటామని చెబుతున్నారు. బీఆర్ఎస్ కూడా పదేళ్లగా రాష్ట్రంలో యువతకు అనేక పథకాలు అందించడంతో పాటు ఉద్యోగాలు కూడా భర్తీ చేశామని, మళ్లీ తమను గెలిపించాలని యువతకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువత ఎటువైపు మొగ్గు చూపుతుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది.



పార్లమెంట్ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాలు
1. మహేశ్వరం
2. రాజేంద్రనగర్
3. శేరిలింగంపల్లి
4. చేవెళ్ల
5. వికారాబాద్
6. తాండూరు
7. పరిగి



యువ ఓటర్లే కీలకం!

మొత్తం ఓట్లలో 52% వారివే
39 ఏళ్లలోపు ఓటర్లు 15,20,890 మంది
వారు ఎవరి వైపు మొగ్గు చూపితే వారికే విజయావకాశం
యువత ఓట్లపై ప్రధాన పార్టీల గురి
వారికోసం హామీల వెల్లువ

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో వారిదే నిర్ణయాత్మక పాత్ర

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/వికారాబాద్ ప్రతినిధి, మే 2 : ఈ నెల 13వ తేదీన జరగనున్న చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తల రాత రాసేది యువ ఓటర్లే. అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు శాసించనున్నారు. వారు ఎటువైపు మొగ్గు చూపితే ఫలితాలు ఆ వైపు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే విజయావకాశాల్లో కీలక పాత్ర పోషిస్తున్న యువతను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. యువ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారెంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామని, ఎన్నికలు పూర్తి కాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, రైతు రుణమాఫీ హామీని ఆగస్టు 15వ తేదీలోగా అమలు చేస్తామని, లోక్‌సభ ఎన్నికల్లో తమ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఈసారి కూడా మకే మద్దతు పలకాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని, అయిదు నెలల కిందట రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ఓటర్లను మభ్య పెట్టాలని చూస్తోందని, ప్రజల సంక్షేమం గురించి, రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించేది బీఆర్ఎస్ ఒక్కటేనంటూ ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

52శాతం యువ ఓటర్లు..

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,504,260 మంది పురుషులు, 1,433,830 మంది మహిలు. అలాగే 280మంది ఇతర ఓటర్లున్నారు. ఈ ఓటర్లలో 18 నుంచి 39 ఏళ్లలోపు యువ ఓటర్లు మొత్తం 15,20,890 మంది ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 39 ఏళ్లలోపు ఓటర్లు జిల్లాలో 52 శాతం ఉన్నారు. ఈ ఎన్నికల్లోనూ యువ ఓటర్లు కీలక భూమిక పోషించనున్నారు. యువ ఓటర్లు తమ కుటుంబ సభ్యులను, ప్రాంత ఓటర్లనూ ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకే ప్రధాన పార్టీలు యువ ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఓటు బ్యాంకుగా ఉండే యువ ఓటర్లను గాలం వేసేందుకు ఆయా పార్టీల నేతలు తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మధ్య వయస్సు ఉన్న ఓటర్ల సంఖ్య కాస్త తక్కువగా ఉంది. 40-49 ఏళ్ల వయస్సు ఓటర్లు 6,07,268 ఉన్నారు. 50-59 ఏళ్ల వయస్సు ఓటర్లు 3,62,074 ఉన్నారు. 60-69 ఏళ్ల వయస్సు ఓటర్లు 2,13,014 ఉన్నారు. 70-79 వయస్సు ఓటర్లు 1,02,115 ఉన్నారు. 80-89 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 26,226 ఉండగా 90-99 ఏళ్ల వయస్సు ఓటర్లు 4,531 మంది ఉన్నారు.

269 మంది శతాధిక ఓటర్లు..

చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో శతాధిక ఓటర్లు 269 మంది ఉన్నారు. అత్యధికంగా మహేశ్వరం నియోజకవర్గంలో 95 మంది ఉన్నారు. తర్వాత స్థానంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 93, రాజేంద్రనగర్‌లో 65 మంది ఉన్నారు. అత్యల్పంగా తాండూరులో ముగ్గురు, వికారాబాద్‌లో ఐదుగురు శతాధిక ఓటర్లున్నారు. శతాధిక ఓటరు పరిగిలో ఒక్కరు కూడా లేక పోవడం విశేషం.

చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో వయస్సుల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80-89	90-99	100-120
మహేశ్వరం	50,963	1,04,113	1,64,775	1,2,1057	7,76,82	45,610	22,465	6,400	1,236	95
రాజేంద్రనగర్	55,568	1,13,241	1,92,334	1,41,689	80,468	45,070	20,191	4,522	791	65
శేరిలింగంపల్లి	54,138	1,12,281	2,39,949	1,93,788	99,951	59,885	30,233	7,779	1,304	08
చేవెళ్ల	28,822	57,685	70,239	55,732	39,153	23,535	11,353	3,339	578	93
పరిగి	10,368	62,369	77,230	50,854	33,269	20,423	9,483	2,249	321	00
వికారాబాద్	7,081	50,173	69,561	44,148	31,551	18,491	8,390	1,937	301	05
తాండూరు	8,716	57,625	71,011	47,974	32,034	17,191	7,556	1,754	228	03

30 ఏళ్లు దాటిన వారిలో మహిళలే అధికం..

చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 30-39 ఏళ్లు దాటిన ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 4,78,803 మంది ఉండగా మహిళా ఓటర్లు 4,79,057 ఉన్నారు. అలాగే 80-89 మధ్య ఉన్న వయస్సు ఓటర్లలో కూడా మహిళలదే పై చేయిగా ఉంది. 14,203 పురుషుల ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 15,632 ఉన్నారు. అలాగే 90-99 మధ్య వయస్సు ఓటర్లలో కూడా మహిళలు ఎక్కువగా ఉన్నారు. వీరిలో 2,075మంది పురుష ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 2,901మంది ఉన్నారు.

పెరిగిన పోలింగ్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక



రంగారెడ్డి అర్బన్, మే 2 : పెరిగిన పోలింగ్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. వేసవి తీవ్రత, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని వివిధ వర్గాల వారి అభ్యర్థన మేరకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు పెంచిన సమయం అందుబాటులో ఉంటుందని సూచించారు. వాస్తవానికి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా, ఈసారి మాత్రం ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని భారత ఎన్నికల సంఘం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ సమయం పెంపు వల్ల ఉద్యోగులు, వ్యాపారస్తులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో అధిక సంఖ్యలో పాల్గొని ఓటుహక్కును వినియోగించుకునేందుకు మరింత వెసులుబాటు లభించిందన్నారు. పెంచిన పోలింగ్ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, ప్రతీ ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకోవాలి

పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బందికి అన్ని నియోజకవర్గ (మహేశ్వరం నియోజకవర్గానికి సంబంధించి సరూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించి అత్తాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో, చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో, పరిగి నియోజకవర్గానికి సంబంధించి పరిగిలోని నెంబర్ వన్ బాలుర ఉన్నత పాఠశాలలో, వికారాబాద్ నియోజకరర్గానికి సంబంధించి వికారాబాద్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, తాండూర్ నియోజకవర్గమునకు సంబంధించి తాండూర్ సాయిపూర్ లోని నెంబర్ వన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో) కేంద్రాలలో సంబంధిత ఏఆర్‌వోలు ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటీ సెంటర్లలో ఈ నెల 8వ తేదీ వరకు ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో విధుల్లో పాల్గొంటున్న 23వేల మంది ఓటర్లు తమ ఓటుహక్కును ఈ ఓటర్ ఫెసిలిటీ సెంటర్స్ ద్వారా వినియోగించుకోవాలని కలెక్టర్ శశాంక సూచించారు.



ఏఆర్ఓకు సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు త్సెవాంగ్ గ్యాచో భూటియా

స్ట్రాంగ్‌రూం పరిశీలన

షాద్‌నగర్, మే 2: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు త్సెవాంగ్ గ్యాచో భూటియా స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. షాద్‌నగర్ మినీ స్టేడియంలో భద్రపరిచిన ఈవీఎంలను ఆయన తనిఖీ చేశారు. అలాగే స్థానిక ఠాగూర్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణ శిబిరాన్ని కూడా సందర్శించారు. అనంతరం ఎన్నికల ఏర్పాట్ల విషయమై ఏఆర్ఓ వెంకట మాధవరావుతో చర్చించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. షాద్‌నగర్‌కు అదనంగా 330 ఈవీఎంలు వచ్చాయని ఏఆర్ఓ వెంకటమాధవరావు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



ఆదిభట్ల, మే 2 : ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగర కలాన్‌కు చెందిన నీళ్ల శ్రీధర్(38) ఆదిభట్ల మున్సిపాలిటీలో శానిటరీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముట్టడంతో మానసిక వేదనకు గురై గురువారం మధ్యాహ్నం బెడ్రూంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. వేసవి సెలవులు రావడంతో భార్య, కూతుళ్లను గురువారం ఉదయం తల్లి వారింటి వద్ద వదిలేసి వచ్చి మధ్యాహ్న సమయంలో ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎంపీడీవో సరితకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

కందుకూరు, మే 2 : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లును వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మిలకుతో కలిసి ఎంపీడీవో సరితకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి మధ్యాహ్న భోజన కార్మికులు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారు చేసిన పనికి నిధులు మంజూరు చేయక పోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సరిత మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నందిగామ, మే 2 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. కాళ్లకు చేపల గాలం చిక్కుకోవడంతో అతడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నందిగామ మండలం వీర్లపల్లికి చెందిన చిందం వితలయ్య(50) చేపలు పట్టడానికి మండలంలోని అప్పారెడ్డిగూడ చెరువులోకి వెళ్లాడు. ఈ క్రమంలో వితలయ్య కాళ్లకు చేపల గాలం చిక్కుకోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాడితో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు.

నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలి

● టౌన్ ప్లానింగ్ ఆర్‌డీడీ పీవీ రామనర్సింహారెడ్డి ● నాగారంలో తనిఖీలు

కీసర రూరల్, మే 2: నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలని డైరెక్టరేట్ టౌన్ ప్లానింగ్ ఆర్‌డీడీ పీవీ రామనర్సింహారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదులు రావటంతో గురువారం నాగారం మున్సిపాలిటీలోని పలు నిర్మాణాలను ఆయన తనిఖీ చేసారు. ప్రధానంగా రాంపల్లి నుండి చెర్లపల్లి దారిలో ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంటును, ఆర్‌ఎల్‌నగర్ వద్ద కొనసాగుతున్న ఓ పాఠశాలతో పాటు పలు నిర్మాణాలను, అనుమతికి సంబంధించిన ధృవ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు, టీఎస్‌బీపాస్ ద్వారా అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జూన్ నెలాఖరు నుండి పూర్తి స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించేందుకుప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ టీపీఓ కావ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలి

మేడ్చల్ టౌన్, మే 2 : ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని మహిళ సామాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శేఖర్ అన్నారు. ఓటు హక్కు వినియోగం పట్ల గురువారం మహిళా సమాఖ్యలకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వచ్చేనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో అత్యధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ప్రధానంగా ఓటు పై మహిళల్లో చైతన్యం తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్యలు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై మహిళా సమాఖ్యలకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ శేఖర్

ఎన్నికల్లో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

● వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, మే 2: ఎన్నికల పోలింగ్ నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర కీలకమని వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన పీవో, ఏపీవోల శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాజకీయ పార్టీల కతీతంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ నిర్వాహణపై పీవో, ఏపీవోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సురేశ్ కుమార్, పీవో, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.



పీవో, ఏపీవోల శిక్షణలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అయ్యప్ప ఆలయానికి విరాళం అందజేత

బషీరాబాద్, మే 2: మండల కేంద్రంలో రూ.కోటీ 50లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి జీవన్గి గ్రామానికి చెందిన సిరేళ్లి మాధవరెడ్డి కుటుంబీకులు రూ.18 వేల నగదును అందజేశారు. ఈ నగదును ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సాయిల్‌గౌడ్‌ను స్వయంగా కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పవాన్‌ఠాగూర్, విషకదమ్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మాధవరెడ్డి కుటుంబసభ్యులు

అదనపు బీయూల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి


ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న నారాయణరెడ్డి

మేడ్చల్ మే 2(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున అదనపు బ్యాలెట్ యూనిట్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియలతో కలిసి ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలో మొదటి విడతలో 3,029 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు. నామినేషన్ విత్‌డ్రా అనంతరం 22 మంది పోటీలో ఉన్నందున అదనపు బీయూలు అవసరం పడగా సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల్లో గల 2,425 పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లను కేటాయించామని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గంలో గల 591 పోలింగ్ కేంద్రాలకు 738 బ్యాలెట్ యూనిట్లు, మల్కాజిగిరి నియోజకవర్గంలో 418 పోలింగ్ కేంద్రాలకు 522, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 592 పోలింగ్ కేంద్రాలకు 740, కూకట్‌పల్లి నియోజకవర్గంలో 417 పోలింగ్ కేంద్రాలకు 521, ఉప్పల్ నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాలకు 508 మొత్తం 3,029 బ్యాలెట్ యూనిట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులసమక్షంలో పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మొదటి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌కు సంబంధించిన హార్డ్‌కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ తరువాత బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు: జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

వికారాబాద్ : మొదటిస్థాయి తనిఖీ పూర్తయిన బ్యాలెట్ యూనిట్లను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయిస్తామని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గిడ్డంగిలో బ్యాలెట్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ అవసరాల మేరకు ఎన్నికల సంఘం అదనంగా మరో 2వేల బ్యాలెట్ యూనిట్లు కేటాయించిందన్నారు. బ్యాలెట్ యూనిట్లను మొదటిస్థాయి తనిఖీ అనంతరం ర్యాండమైజేషన్ చేసి అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈడీఎం మహమూద్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీరాం, మహిపాల్, వినోద్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.


ఆన్‌లైన్ ద్వారా సప్లిమెంటరీ బీయూల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న గౌతమ్

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలి


వికారాబాద్‌లో పోలింగ్ కేంద్రం గదిని పరిశీలిస్తున్న ఏఆర్‌వో రాహుల్ శర్మ

వికారాబాద్/పరిగి, మే 2: అర్హులైన ప్రతీఒక్కరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని లోక్‌సభ సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ అన్నారు. వికారాబాద్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీఒక్కరి ఇంటికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెక్టోరియల్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ల ఫోన్‌నంబర్లను ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సాజిదాబేగం, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు. అదేవిధంగా పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నెంబర్ 2 బాలుర పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వాసుచంద్ర తెలిపారు. పోలింగ్ సిబ్బంది 3,4 తేదీల్లో ఓటు వేయాలని సూచించారు. ఆరు తేదిన అంత్యవసర సేవలు అందించే ఉద్యోగులు, ఆర్టీసీ, రైల్వే బీఎస్ఎన్ఎల్, ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు 7, 8తేదీలోట్ల పోలీసు శాఖ ఉద్యోగులు పోస్టల్ ఓట్లు వేసుకోవాలని సూచించారు. 5, 6 తేదీల్లో దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన సిటిజన్లు ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారమే ఆయా శాఖల్లోని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

నిండు మనస్సుతో ఆశీర్వదించండి

» చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల, మే 2 : దేశంలో అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమిదే హవా నడుస్తోందని, చేవెళ్ల ప్రాంత ప్రజలందరు తనను నిండుమనస్సుతో ఆశీర్వదించి మరోసారి ఎంపీగా గెలిపించాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. గురువారం రాత్రి చేవెళ్ల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ నా శ్వాశ.. ఆశ చేవెళ్ల అని చెప్పారు. గత ఐదేళ్లుగా ఎంపీగా ఉండి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి నిధులు మంజూరు చేయించానన్నారు. జీవో 111ను ఎత్తివేయించానన్నారు. పేదలకు పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీని ప్రజలందరు ఆశీర్వదించి, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువతను బీజేపీ మాటలతో మభ్యపెడుతుందన్నారు. శ్రీరాముడు అందరి వాడు అని, బీజేపీ నాయకులు మాత్రం దేవుడి పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తుందని మండిపడ్డారు. విశ్వేశ్వర్‌రెడ్డి వద్ద 5 వేల కోట్ల సంపద ఉండొచ్చుకానీ, నావద్ద ప్రజలకు సేవ చేసే మనస్తత్వం ఉందన్నారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు తదితరులున్నారు. చేవెళ్ల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు రేగడిఘనాపూర్, దేవరంపల్లిలో ప్రచారం నిర్వహించారు.

జీవితం మొత్తం రుణపడి ఉంటా

మొయినాబాద్ రూరల్, మే 2: పదిరోజులు కష్టపడి తన గెలుపుకోసం పనిచేస్తే.. చేవెళ్ల ప్రాంత ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌కు చెందిన బ్యాగరి రాజు, గడ్డం మహేందర్‌రెడ్డి, ఈగ సాయిరెడ్డి, కండికొండ మహేష్, బీజేపీ నాయకులు యాలాల గౌతమ్‌రెడ్డి, కమ్మరి శ్రీనివాస్‌చారి, ఉప్పరి సందీప్, బంటి గౌడ్ తదితరులు రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బాకారం జాగీర్, నాగిరెడ్డిగూడ, చందానగర్‌లో ఆర్యన్‌రెడ్డి మండలాధ్యక్షుడు మాణెయ్య, సీనియర్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు.

పెద్దేముల్ : ఎంపీగా తనను మరోసారి గెలిపించండని రంజిత్‌రెడ్డి కోరారు. మంబాపూర్, కందనెల్లి, పెద్దేముల్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మహేశ్వరం/కందుకూరు/మర్పల్లి/ధారూరు/తాండూరు/తాండూరు రూరల్/యాలాల/మోమిన్‌పేట్/ : రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. గంగారం, గంగారం తండాలో ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి నేతలతో కలిసి కందుకూరు మండల పరిధిలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఏనుగు జంగారెడ్డి, పాండురంగారెడ్డి, తదితరులున్నారు. మర్పల్లి మండలాధ్యక్షుడు యు.రవీందర్ మండలంలోని బూచన్‌పల్లిలో ప్రచారం చేశారు. ధారూరు మండలం అంతారం, తరలిగోపులలో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. తాండూరు మండలం ఉద్దండాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఉద్దండాపూర్ మాజీ సర్పంచ్ శివరాజ్‌తోపాటు మరో 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. తాండూరులోని ముదిరాజులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ రోడ్డుమార్గంలో ముదిరాజులకు స్థలం కేటాయిస్తామన్నారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని యాలాల మండలం పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి గోరేపల్లిలో ప్రచారం చేశారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు దుర్గంచెరువు, చిన్నకొల్కుంద తదితర గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు శంకర్‌యాదవ్, తదితరులున్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో సీతారాంపేట గుమస్తా నగర్, వాసవి తదితర కాలనీల్లో రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిండెంట్, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణాధ్యక్షుడు హబీబ్‌లాల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


చేవెళ్ల : కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

పదేళ్ల బీజేపీ ఒరగబెట్టిందేమీ లేదు

వికారాబాద్/దోమ/పూడూరు/ : పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బాసుపల్లి, శివారెడ్డిపల్లి, గూడూరు, దొంగ ఎన్కెపల్లి, దాదాపూర్, దిర్సంపల్లి గ్రామాల్లో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా పూడూరు మండలం తుర్కఎన్కెపల్లి, మంచన్‌పల్లిలో నాయకులు ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు సురేందర్ ఉన్నారు. వికారాబాద్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పట్టణంలోనే కన్య లాల్ బాగ్, గరీబ్ నగర్‌లో ప్రచారం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు దోపిడీ పార్టీలు

పరిగి : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్లపాటు దోపిడీకి పాల్పడ్డాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. పరిగిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇంత పెద్ద స్కాంలు, అవినీతి, అక్రమాలు ఏ ప్రభుత్వంలో జరగలేవన్నారు. మే 6న తాండూరులో జరిగే ప్రియాంకగాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు.

సమస్యల పరిష్కారం బాధ్యత నాది

» మెకానిక్‌ల అసోసియేషన్ సమావేశంలో ఈటల రాజేందర్

మల్కాజిగిరి/ అల్వాల్/మచ్చబొల్లారం/కీసర రూరల్/మేడ్చల్ టౌన్/రామంతాపూర్/కుషాయిగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): 'నేనెవరో మీకు తెలుసు. నేను కొత్త కాదు. నా రాజకీయ జీవితం గురించీ మీకు తెలుసు.. నాపై విశ్వాసంతో మద్దతిచ్చేందుకే వచ్చారని భావిస్తున్నా. మీ సమస్యల పరిష్కారం నా బాధ్యత' అని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి జిల్లా బైక్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులకు ఆయన భరోసా కల్పించారు. గురువారం ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఈటెల పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఇక్కడ ఎవరూ గుర్తుపట్టరని, వారికి సమస్యల పట్ల అవగాహన లేదన్నారు. తనకు పేదలు, అన్ని వర్గాల ప్రజా సమస్యలపై అవగాహన ఉందన్నారు. ప్రధాని మోదీ వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడి కేంద్రం ద్వారా ఏదైనా సాధించే సత్తా తనకే ఉందన్నారు. కేంద్రంలో ఉండేది బీజేపీ ప్రభుత్వమే కాబట్టి నిధులు తెచ్చి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తే లోక్‌సభలో కొట్లాడతారని కేసీఆర్ చెబుతున్నారు. కానీ ఇప్పుడు ఆయనే అధికారంలో లేరు. మరి ఆ ఎంపీలు ఢిల్లీకి పోయి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీలను గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతాడని అంటున్నారని, తెలంగాణ ఎంపీలతోనే ప్రధాని అవుతారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, బాలకృష్ణ, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్, సునీతచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అల్వాల్ సర్కిల్ ఇందిరనగర్, అంబేద్కర్‌నగర్‌లలో ఈటల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేకిన్ ఇండియా నినాదంతో ఎన్నో రకాల వస్తువులు ఇక్కడ ఉత్పత్తవుతున్నాయని, అది బీజేపీ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. ప్రజల కష్టాసుఖాలు తెలిసినవాడిగా తనను గెలిపిస్తే సేవ చేస్తా రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ హరిజనబస్తీ, మల్లారెడ్డినగర్‌లో ప్రచారం నిర్వహించారు. దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం అని ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈటల నివాసంలో కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మేడ్చల్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో ఈటల పాల్గొన్నారు. రామంతాపూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఈటల మాట్లాడుతూ.. ధర్మం కోసం బీజేపీని గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు బోగస్ అన్నారు. చర్లపల్లి సిరి గార్డెన్స్‌లో జరిగిన బంజారా ఆత్మీయ సమ్మేళనంలో ఈటల మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బంజారాలకు అండగా ఉందని, కేంద్ర మంత్రివర్గంలో 12మంది ఎస్టీలకు స్థానం కల్పించారని గుర్తుచేశారు.


అల్వాల్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఈటల రాజేందర్

ఈటలకు మద్దతుగా నేతల ప్రచారం

రామంతాపూర్/జవహర్‌నగర్/హయత్‌నగర్/చంపాపేట:ఈటల రాజేందర్‌కు మద్దతుగా హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్, సాయిచిత్రానగర్‌లలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన, డివిజన్ అధ్యక్షుడు హరీష్ ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి రాజేందర్‌కే మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్, కొత్తగుడిసెల బస్తీల్లో ప్రచారం చేశారు. హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అరుణోదయనగర్‌కాలనీ, భాగ్యలత, బీడీఎల్ కాలనీ, సాయినగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. చంపాపేట డివిజన్ శ్రీనిధి, దుర్గానగర్, నిర్మలనగర్, క్రాంతినగర్, రాజిరెడ్డినగర్‌కాలనీల్లో ఈటల రాజేందర్ సతీమణి జమున, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి కలిసి ప్రచారం నిర్వహించారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● మాజీ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

పూడూరు/ధారూరు/యాలాల, మే 2: రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని మాజీ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. పూడూరులోని మన్నెగూడ జేసీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ ఎంపీపీ మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. బీసీలంతా ఏకమై కాసానిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అనిల్‌రెడ్డి, రాంచందర్‌రావు, రాం బాబు, నాగేందర్ గౌడ్, మేఘమాల పాల్గొన్నారు. అదేవిధంగా ధారూరులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని అన్నారు. అదేవిధంగా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలో యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ఆశీర్వాదసభలో సబితారెడ్డి పాల్గొని మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం

నవాబుపేట/బషీరాబాద్/మొయినాబాద్ రూరల్/చేవెళ్ల/కందుకూరు: కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నవాబుపేట మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత లాభాల కోసమే బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లోకి వెళ్లారని విమర్శించారు. ఈ సమావేశంలో కందాడ నాగిరెడ్డి, డాక్టర్ జీ.ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా కాసానికి బీసీలు మద్దతివ్వాలని బషీరాబాద్ వైస్ ఎంపీపీ జడల అన్నపూర్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ నాయకులు ఎన్ని కుతంత్రాలు చేసినా చేవెళ్ల పీఠం బీఆర్ఎస్‌కే దక్కుతుందని, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పార్లమెంటులో అడుగుపెట్టడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా మొయినాబాద్ మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కనకమామిడిలో ప్రచారం చేపట్టారు. జడ్పీటీసీ శ్రీకాంత్ పాల్గొన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ చేవెళ్ల మండల కేంద్రంలోని అన్నికాలనీల్లో ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ పాల్గొన్నారు. కాసానిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్ర శేఖర్‌లు కోరారు. కందుకూరులోని గూడూరు, కటకపల్లి, అన్నోజిగూడలో మండల శాఖ అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.


కీసరలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకే

కీసర/ఘట్‌కేసర్/కీసర రూరల్, మే 2: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకేనని మాల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కీసరలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడ నుంచి ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు, అదేవిధంగా నాచారంలో భారీ ర్యాలీలు నిర్వహించారు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

» రాజ్యసభ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి నారాయణలాల్ పంచారియ

మొయినాబాద్ రూరల్/ధారూరు/కందుకూరు/చేవెళ్ల/ మహేశ్వరం, మే 2: బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు అందరూ కష్టపడి పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి నారాయణలాల్ పంచారియ అన్నారు. మండలంలోని అజీజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తప్పుదోవ పట్టిస్తున్నారని పూర్తి వివరాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీకి ప్రస్తుతం 400 సీట్లు ఉన్నాయని రిజర్వేషన్ల జోలికి పోలేదని ప్రజలు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, బట్టు రాజమల్లేష్, సుధాకర్‌రెడ్డి, మాదవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవి, రాజు గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా ధారూరు మండలంలోని నాగారం, అంతారం గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించి బీజేపీ ఎంపీ అభ్యర్థి కె.విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, నందు, రాజునాయక్, రమేశ్, నరేందర్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. గురువారం ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, కొత్తగూడ మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి ఆధ్వర్యంలో కొత్తగూడ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, దయాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీందర్, పి.చెన్నకృష్ణ, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల్‌లో ఎంపీపీ మాల్గారి రమణారెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శర్వలింగం, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చలక్ష్మణ్ ప్రచారం నిర్వహించారు.



అజీజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూన్న రాజ్యసభ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి నారాయణలాల్ పంచారియ


కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

బీజేపీలో చేరికలు

మోమిన్‌పేట్/తాండూరు రూరల్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి సమక్షంలో మేకవనంపల్లి, ఎన్కెపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేశ్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, పాండుగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు మండలంలోని జినుగుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా, కండువాకప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కాంగ్కెస్ సీనియర్ నాయకులు ముదిరాజ్ శ్రీనివాస్, వడ్డెర సంఘం అధ్యక్షుడు వీరేశం, రాములు, నర్సింహులు చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్కెపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని తుక్కుగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ఆరుట్లలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కుతోనే బయటకొచ్చా

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మంచాల, మే 2(ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు కావడంతోనే తాను బయటకొచ్చి కాంగ్రెస్‌ను గెలిపించుకున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు కొట్టిన దెబ్బకు కారు షెడ్డుకు పోయిందని, అక్కడి నుంచి తుక్కుకే పోతుందని ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌రెడ్డి గురువారం నిర్వహించిన ప్రచార యాత్రలో ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం పదేళ్లు తెలంగాణను దోచుకుతిందని దుయ్యబట్టారు. వచ్చే బతుకమ్మ పండుగను కల్వకుంట్ల కవిత తీహార్ జైల్లో జరుపుకుంటుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు కూడా జైలుకు వెళ్లడం ఖాయమని ఆరోపించారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓట్లువేసి భువనగిరి ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార యాత్రలో కాంగ్రెస్ నేతలు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, వెదిరె హన్మంతురెడ్డి, చీమల జంగయ్యయాదవ్, జెనిగె వెంకటేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే గిరిజనుల గొంతుకనవుతా

● నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ఆమనగల్లు, మే 2 : ఎంపీగా గెలిపిస్తే గిరిజనుల గొంతుకనవుతానని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా గిరిజన గర్జనసభ నిర్వహించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, దశరథ్ నాయక్, వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. స్థానిక సేవాలాల్ ఘాట్ వద్ద పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన సభలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన, దళిత బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మండలంలోని గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

లయన్స్‌క్లబ్ పీఆర్వోగా పాషా



ఆమనగల్లు, మే 17:ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్వోగా ఎంఏ పాషా 16వ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ లయన్స్ క్లబ్ సేవలను విస్తరింపచేస్తున్నందుకు మరో సారి పాష కు అవకాశం కల్పించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రతీ ఏడాది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. 2008 నుంచి లయన్స్‌క్లబ్ పీఆర్వోగా వరుసగా పాషా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. పాషా లయన్స్‌క్లబ్ నుంచి రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో అనేక సేవా పురస్కారాలు అందుకున్నారు. 2024-25 సంవత్సరానికి పాష పీఆర్వో గా ఎన్నికైనట్లు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. 16వ సారి పీఆర్ఓ గా బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో పాష ను పలువురు గురువారం అభినందించారు. తన పై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి లయన్స్‌క్లబ్ సేవల విస్తరణకు కృషి చేస్తానని పాష పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్ బాబు, రాంరెడ్డి లయన్స్‌క్లబ్ ఆసుపత్రి చైర్మన్ దామోదర్ రెడ్డి లకు పాష కృతజ్ఞతలు తెలిపారు.

భారీ మొత్తంలో నల్లమందు స్వాధీనం

● రూ.కోటీ 73లక్షల విలువచేసే నల్లమందు పౌడర్, నకిలీ గుట్కా ప్యాకెట్లు సీజ్

● ఇద్దరు నిందితుల అరెస్టు..

బొలెరో వాహనం, పది సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన నకిలీ మీరజ్ గుట్కాలు



గుట్కా పాకెట్లు తయారు చేసే మిషన్

శంషాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి) : రూ.కోటీ 73లక్షల విలువచేసే నల్లమందు పౌడర్, నకిలీ గుట్కా ప్యాకెట్లను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలోని కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం సాయంత్రం జరిపిన దాడుల్లో నల్లమందుతో పాటు నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో దలరాం అనే వ్యక్తి గోదాం ఏర్పాటు చేసుకొని కొంతకాలంగా ఈ దందా నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు దలరాంతో పాటు అజర్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బొలేరో వాహనాన్ని, పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, వారు గోదాంలో నల్లమందు పౌడర్‌ను ఉపయోగించి గుట్కా ప్యాకెట్లు తయారు చేసేందుకు బొలేరో వాహనంలో రాజస్థాన్ నుంచి ముడిసరుకును తీసుకొచ్చేవారని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. బాబుల్‌రెడ్డి నగర్ నుంచి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శంషాబాద్ ఎక్సైజ్ సిబ్బందితో పాటు ఎస్వోటీ పోలీసులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిషేధిత మత్తు పదార్థాలు భారీగా పట్టుబడ్డాయి. దలరాం అనే వ్యక్తి ఈ దందాకు తెరలేపినట్లు తేలింది. నకిలీ మీరజ్, విమల్ గుట్కాల తయారీలో నల్లమందు పౌడర్‌ను వాడుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. డూప్లికేట్ పాన్‌పరాగ్ తయారీలో కూడా ఈ మత్తుమందు వాడుతున్నట్లు తేలిందని చెప్పారు. ఈ మేరకు ఎన్డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ కృష్ణప్రియతో పాటు ఆయా శాఖల సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : వీర్లపల్లి



షాద్‌నగర్ అర్బన్ : కిషన్‌నగర్ గ్రామస్థులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్/చౌదరిగూడ/షాద్‌నగర్‌రూరల్/కేశంపేట/కొందుర్గు, మే 2: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులున్నారు. రాష్ట్ర ప్రజలు తిరిగి ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకుంటున్నారని వీర్లపల్లి అన్నారు. కొత్తూర్ మండలం మల్లాపూర్, మల్లాపూర్‌తండా, గుడితండా, పెద్దగుట్టతండా, మక్తగూడ, గూడూర్‌లో ప్రచారం చేశారు. మాజీఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కేశంపేట జడ్పీటీసీ విశాలశ్రవణ్, మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులున్నారు. వంశీచంద్‌రెడ్డి సతీమణి ఆశ్లేషారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే సతీమణి అనురాధలు జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో చౌదరిగూడ మండలం గుంజల్‌పహాడ్, జాకారం, చేగిరెడ్డి ఘణాపూర్‌లో వంశీచంద్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలకు చెందిన నాయకులు హాజరై మాట్లాడారు. వంశీచంద్‌కు మద్దతుగా ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్లలో మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి ప్రచారం చేశారు. వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో ప్రచారం చేశారు. పానుగంటి పర్వతాలు, తదితరులున్నారు. వంశీచంద్‌ను గెలిపించాలని సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రచారం చేశారు. చౌలపల్లిలో మండలాధ్యక్షుడు వీరేశ్, కొత్తపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, కొండారెడ్డిపల్లిలో ఆనంద్ కుమార్, కేశంపేటలో శ్రీధర్‌రెడ్డిలు, ఆశ్లేషారెడ్డి కొందుర్గు మండలం తంగళ్లపల్లి, పర్వతాపూర్‌లో ప్రచారం చేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



షాద్‌నగర్‌రూరల్, : మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

చౌదరిగూడ/షాద్‌నగర్‌రూరల్/కేశంపేట, మే 2: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. గురువారం చౌదరిగూడ మండలం గుర్రంపల్లి, రావిర్యాలలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే చౌదరిగూడ మండల కేంద్రానికి చెందిన నాయీబ్రహ్మణ సంఘం సభ్యులు అందె బాబయ్య సమక్షంలో సుమారు 50 మంది బీజేపీ పార్టీలో చేరారు. మచ్చ సుధాకర్ రావు, మండలాధ్యక్షుడు కురుమయ్య, తదితరులున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. డీకే అరుణకు మద్దతుగా ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో ప్రచారం నిర్వహించారు. దొడల వెంకటేష్, శ్రీకాంత్, వినోద్ నాయక్, తదితరులున్నారు. డీకే అరుణమ్మ గెలుపులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బీజేపీ సీనియర్ నాయకులు పసుల నర్సింహ యాదవ్, రేల్లు రాఘురాములు గౌడ్ పిలుపునిచ్చారు. కేశంపేట మండలం కొత్తపేట, పోమాల్‌పల్లిలో గురువారం ప్రచారం నిర్వహించారు. మహేష్, గెల్వారెడ్డి, శేఖర్, కృష్ణ, పాండు, రాజు, శివ, అమ్రేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నాయకుల పరామర్శ

తలకొండపల్లి, మే 2: మండల పరిధిలోని ఇస్రాయిపల్లికి చెందిన రాచాలపల్లి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని గురువారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు జంగయ్య, రాజు, కిరణ్, నరేశ్, శంకరయ్య, రవి, రాజు, రమేశ్, మహేశ్, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మేలు



షాద్‌నగర్ : నాయకులు ప్రచారం

షాద్‌నగర్/కొందుర్గు/కొత్తూర్, మే 2 : బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని కోరారు. షాద్‌నగర్ ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాలరాజు యాదవ్ షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో కేవలం 140 రోజుల్లోనే కాంగ్రెస్ గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అంజయ్య యాదవ్ కోరారు. బుధవారం రాత్రి కొందుర్గు మండలం తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పర్వతాపూర్, పులుసుమామిడి, మహాదేవ్‌పూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ ఇన్ముల్‌నర్వలో మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమానత్వం



కడ్తాల్ : చరికొండలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్/తలకొండపల్లి, మే 2: దేశంలో కుల గణన చేపట్టి సామాజిక వర్గాలవారీగా రిజర్వేషన్ల పెంపునకు కాంగ్రెస్ కృషి చేస్తుంటే.. రాజ్యాంగాన్ని మార్చి ఉన్న రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు బీజేపీ కుట్రలు సాగిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన, సమానత్వం సాధ్యమని ఆయన అన్నారు. కడ్తాల మండలం ముద్విన్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బీక్యనాయక్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేవారు. ఎంపీపీ అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, తదితరులున్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లు రవిని గెలిపించాలని ప్రచారం చేశారు. మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, పెంటయ్య తదితరులున్నారు.

నైతిక విలువలను పెంపొందించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పాపిశెట్టి రాము, గోపాల్ నాయక్

తలకొండపల్లి, మే 2: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను అలవరచుకొని లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు , ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ లు అన్నారు. చదువుతోపాటు విద్యార్థులు జీవిత నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని వారు సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామి దేవాలయంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి నృత్యసంగీత శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వాహకుడు చిత్తరంజన్ దాస్ తో కలిసి రాము, గోపాల్ నాయక్ లు ప్రారంభించారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకుడు చిత్తరంజన్ దాస్ పేర్కొన్నాడు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల అభిరుచులకనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా విద్యార్థులు విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా రాణించాలని రాము, గోపాల్ నాయక్ లు కోరారు. వేసవి నృత్యసంగీత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న చిత్తరంజన్‌ను పలువురు అభినందించారు.,ఈ కార్యక్రమంలో పాపిశెట్టి శ్వేత, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పాండు, క్యాంప్ ఇంచార్జి పరమేశ్వరి, రవికాంత్, శ్రీశైలం, దినేశ్,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద తొలగిన తాగునీటి ఇబ్బందులు



ఆలయం వద్ద బోరు వేయిస్తున్న పెంటయ్య

పూడూరు మే 2: పూడూరు మండల పరిధిలోని రాకంచర్ల లక్ష్మీనర్సింహస్వామి ఆవరణలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు తొలగాయి. తిరుమలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాకంచర్ల పెంటయ్య భక్తుల దాహార్తిని తీర్చేందుకు గురువారం బోరుబావిని తవ్వించారు. తన సొంత నిధులతో అట్టి బోరుబావిని వేయించారు. దీంతో భక్తులు పెంటయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

యాచారం : భువనగిరి ఎంపీగా డా.బూరనర్సయ్య గౌడ్‌ను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పగడాల శ్రీ శైలంలు పేర్కొన్నారు. గురువారం వారు మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి గ్రామాలలో ఉపాధి హామీ కూలీల మద్దతు కోరారు. అంతకు ముందు వారు ఆ యా గ్రామాలలో ఇల్లిల్లు తిరిగి ఓటర్ల మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌పార్టీ ఎంపీ ఉండి ఈ ప్రాంత ప్రగతికి ఏ మాత్రం అభివృద్ధి చేయలేకపోయారని వారన్నారు. నేడు ప్రతీ పేద కుటుంబానికి ఉచితంగా ఆరు కిలోల రేషన్ బియ్యం బీజేపీ ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలలో బీ జేపీ నాయకులు కార్తిక్‌చారి, నరేష్, రవి. రమేష్ తదితరులున్నారు.

యాచారం : భువనగిరి ఎంపీగా బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేష్‌కు మద్దతు ఇ వ్వాలని కోరుతూ గురువారం యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇల్లిల్లు తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు ఓటర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు పేదల కష్టాలు పట్టడం లేదన్నారు. అధికారంలోకి రాగానే సామాజిక పింఛన్లు పెంచుతామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ఇంత దాక పెంచి ఇ వ్వలేకపోతుందని వి మర్శించారు.బీఆర్‌ఎస్ నాయకులు కాసాని రవి గౌడ్, బి.కృష్ణ, కె.జంగయ్య, డి.మహేష్, యాదయ్య గౌడ్, వెంకటయ్య, మహేందర్ తదితరులున్నారు.

మంచాల : భువనగిరి బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలపించాలని ఆయన కూతురు క్యామ ఆరోని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంచాల మండల పరిధి ఆరుట్ల తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోని మాట్లాడుతూ అనునిత్యం ప్రజల్లో ఉండే క్యామమల్లేష్ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉన్నారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాలరమేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొద్దు సికిందర్‌రెడ్డి, చిందం రఘుపతి, కందాల శ్రీశైలం, మాద్గుల కృష్ణ, ఎండీ.జానీపాష, పున్నంరాము, పి.సుకన్య, కాలె గణేష్, చిందం జంగయ్య, వినోద్‌కుమార్, లాలగారి జంగయ్య, చిందం రమేష్, మొగ్రి శ్రీశైలం, బైకని మహేందర్, గడ్డం అశోక్, కాటి కృష్ణ, సతీష్, దాసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల : పార్లమెంటు ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి జహంగీర్ పేర్కొన్నారు. మంచాల మండల పరిదిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆరుట్ల సెక్టార్, మంచాల, లోయపల్లి, దాద్‌పల్లి సెక్టార్‌లలోని గ్రామాల్లో రోడ్‌షోల్లో ప్రసంగించారు. సీపీఎం కార్యదర్శివర్గసభ్యుడు జాన్‌వెస్లీ, పగడాల యాదయ్య, వెంకట్‌రాములు, శ్రీరాంనాయక్, వెంకటేష్, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, నర్సింహ, సిలివేరు రాజు, ముక్కం వెంకటేష్, మహేష్, జానీ, శంకర్, రాజు, జంగయ్య, సుధాకర్, యాదయ్య, రవి, లింగం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎ న్నికల్లో బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి , భద్రత , సుస్థిర , నీతి వంతమైన పాలన సాధ్యమని బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్యనాయక్, శివకుమార్, రవినాయక్, లక్ష్మణ్ నాయక్, పాండు నాయక్, గోపి, మహేశ్, న వీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మాడ్గుల : నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా తనకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసేందుకు బీఫామ్ ఇచ్చారని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కారుగుర్తుకు ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాడ్గుల మండల కేంద్రంలో,ఇర్విన్‌లో రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఉప్పలచారిటబుల్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్‌లున్నారు.

మాడ్గుల : మండల కేంద్రంలోని కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ జైపాల్‌రెడ్డి విగ్రహం వద్దనుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీగా వెళ్ళి ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతారని ఎమ్మెల్యే తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యాచకుడు మృతి



ఘట్‌కేసర్ రూరల్, మే 2 : చికిత్స పొందుతూ ఓ యాచకుడు మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పరిసర ప్రాంతంలో భిక్షాటన చేసే యాచకుడు(72) గత నెల 27న స్థానిక బస్టాండ్ సమీపంలో వడదెబ్బకు సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు యాచకున్ని చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అతడిని విచారించగా సికింద్రాబాద్‌కు చెందిన హనుమంతుగా పేరు మాత్రమే చెప్పాడని, మిగతా వివరాలేమీ చెప్పలేదని పోలీసులు తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హనుమంతు గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గృహిణి అదృశ్యం



కడిగి అనిత

ఘట్‌కేసర్ రూరల్, మే 2: గృహిణి అదృశ్యమైన ఘటన పోచారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భీవండికి చెందిన కడిగి కృష్ణ, అనిత(33) దంపతులు రెండు సంవత్సరాల కిందట ఘట్‌కేసర్ మండలం జోడిమెట్లలోని ఓ హాస్టల్‌లో ఉంటూ అక్కడే పని చేస్తున్నారు. కాగా ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం అనిత దుకాణానికి వెళ్తున్నానని హాస్టల్‌లో చెప్పి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపాడు. దీంతో భర్త కృష్ణ పరిసరాల్లో వెతికిన అచూకీ లభ్యంకాలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేక పోవడంతో పోచారం పోలీసు లను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

వికారాబాద్, మే02; వికారాబాద్ రైల్వే స్టేషన్లో బుధవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ శంకరయ్య తెలిపారు. మృతుడి వద్ద వికారాబాద్ నుంచి బీదర్ కి వెళ్లే రైలు టికెట్ మాత్రమే లభించింది. వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిసినట్లయితే 9989355134కు సంప్రదించాలన్నారు.

చికెన్ కర్రీలో పడి బీఆర్‌ఎస్ కార్యకర్తకు గాయాలు



గాయాలపాలైన మల్లయ్య

ధారూరు, మే 2: చికెన్ కర్రీలో పడి బీఆర్‌ఎస్ కార్యకర్తకు తీవ్ర గాయలయ్యాయి. బీఆర్‌ఎస్ కార్యకర్తల ఎన్నికల సమావేశం అనంతరం భోజనాలు చేసే సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ధారూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ముగిసిన అనంతరం సమావేశానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారి భోజనాలు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో చికెన్ కర్రీ వేసుకునేందుకు వెళ్లిన మండల పరిధిలోని కుక్కింద గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గొరెంకల మల్లయ్య కార్యకర్తల తోపులాటలో అదుపు తప్పి పక్కనే ఉన్న చికెన్ బోగాణలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన కార్యకర్తలు ఆయనను వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బీఆర్‌ఎస్ నందివనపర్తి నూతన కార్యవర్గం

యాచారం, మే 2 : మండలంలోని నందివనపర్తి గ్రామ బీఆర్‌ఎస్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు మాజీ సర్పంచ్ రాజునాయక్ తెలిపారు. అధ్యక్షుడిగా కె.శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా బర్ల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా యాంజాల చంద్రకాంత్, యూత్ విభాగం అధ్యక్షుడిగా పి.వంశీ, ఉపాధ్యక్షుడిగా బి.లింగం, ప్రధాన కార్యదర్శిగా జి.క్రాంతి కుమార్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికే అంబలి కేంద్రం ఏర్పాటు



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బండారి రమేష్

షాద్‌నగర్‌అర్బన్, మే 2: మండుటెండల్లో తిరిగే ప్రజల దాహార్తిని తీర్చడానికే ప్రతీయేటా అంబలి, చలివేంద్రం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు షాద్‌నగర్ వాసవి చిట్‌ఫండ్ అధినేత బండారి రమేష్ తెలిపారు. బండారి రాజయ్య, లక్ష్మమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎదుట అంబలి, చలివేంద్రం కేంద్రాలను బండారి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనులపై షాద్‌నగర్ పట్టణానికి వచ్చే వారు మండుటేండల్లో దాహంతో అలమటిస్తుంటారని, వారి దృష్టిలో పెట్టుకుని తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా గత 25 సంవత్సరాల నుంచి అబంలి, చలివేంద్రం కేంద్రాలను ఏర్పాటు చేసి, వేసవి ముగిసే వరకు కొనసాగిస్తున్నట్లు బండారి రమేష్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఆమనగల్లు, మే 2: వేసవి ఎండల నేపథ్యంలో ప్రయాణికుల, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆమనగల్లు , కడ్తాల విద్యుత్ శాఖ ఏఈ లు సీతారాములు , నరేందర్ విద్యుత్ శాఖ 1104 యూనియన్ రాజేంద్ర నగర్ సర్కిల్ కార్యదర్శి లక్ష్మీనారాయణ గౌడ్ లు కోరారు. సమాజ సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని వారు కోరారు. ఆమనగల్లు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆ శాఖ 1104 యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యూనియన్ సర్కిల్ అధ్యక్షుడు సయ్యద్ సుజాత హుస్సేన్, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అదనపు కార్యదర్శి లక్ష్మణ్, వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనులతో కలిసి సీతారాములు, నరేందర్, లక్ష్మీనారాయణ గౌడ్‌లు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన యూనియన్ నాయకులను ఏఈలు అభినందించారు. యూనియన్ నాయకులు భానుప్రకాశ్, మోజమ్, జంగయ్య, రామనాథం, ప్రభుదాస్, వశ్య, విజయ్, వెంకటేశ్, అశోక్, అమ్మ, దేవిలాల్, శ్రీనివాస్, శ్రీకాంత్,రమేశ్, సాయి, రవి, కృష్ణ, తదితరులున్నారు.